## క్లుప్తంగా

### కొత్త పింఛన్లు మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని 11 గ్రామ సచివాలయాలకు వైఎస్సార్ పింఛన్ కానుక కింద నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సచివాలయాల వారీగా.. ఆర్.జంబులదిన్నె 8, మాయలూరు 14, హరివరం 13, సుద్దమల్ల7, తుడుమలదిన్నె 5, ఇంజేడు 2, అల్లూరు 21, ఉయ్యాలవాడ 11, బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు, కొండుపల్లె గ్రామ సచివాలయాలకు6 చొప్పున పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై ఆఖరు వరకు పింఛన్ల కోసం అర్హులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వెరిఫికేషన్ పూర్తి చేసి నివేదిక ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.

### అమరవీరుల త్యాగాలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పుల్లా నరసింహులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విద్యుత్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్ష పార్టీలు ఆందోళన చేసిన సమయంలో కాల్పులు జరపడంతో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి మృతి చెందారని గుర్తు చేశారు. రాజశేఖర్, సుధాకర్, గౌస్, వెంకటలింగం, లక్ష్మణ్, జైలాన్ పాల్గొన్నారు.

### గుడిసె దగ్ధం


చెన్నూరులో కాలిపోయిన గుడిసె

శిరివెళ్ల: మండలంలోని చెన్నూరు గ్రామంలో సోమవారం గుడిసె దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తో గోసా భాస్కర్‌కు చెందిన గుడిసె దగ్ధమవ్వడంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. గుడిసెలో ఉన్న ఫ్రిజ్, కూలర్, రూ.10 వేలు నగదు అగ్నికి ఆహుతయ్యాయి. ఆళ్లగడ్డకు చెందిన అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను ఆర్పి వేసింది.


### ఆర్డినెన్స్ రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): అసైన్డ్ భూముల చట్ట సవరణ ఆర్డినెన్స్ రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో అసైన్డ్ చట్ట సవరణ ఆర్డినెన్స్ పేదలకు నష్టదాయకమని, దానిని వెంటనే రద్దు చేయాలని, భూమిలేని పేదలకు భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి ఈశ్వరయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌కుమార్, రాజశేఖర్, దళిత బహుజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మేకల లింగస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, జానయ్య, మార్కు, రామచంద్రుడు, చెన్నయ్య, వీరభద్రులు, కరీముల్లా, రాజేశ్వరి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### మరో వైద్యశాల మంజూరు

శిరివెళ్ల: మండల కేంద్రం శిరివెళ్లకు 2వ ప్రభుత్వ వైద్యశాల మంజూరైందని డాక్టర్ విజయకుమార్ సోమవారం తెలిపారు. వైద్యశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 35 లక్షలు విడుదల చేసిందని, ప్రస్తుతం ఉన్న వైద్యశాల ఆవరణలోనే కొత్త వైద్యశాల నిర్మాణం జరగనుందని చెప్పారు. నిర్మాణానికి సంబంధించి ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులు భూమి పూజ చేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న వైద్యశాలను నాడు-నేడు కింద అభివృద్ధి చేశారని పేర్కొన్నారు.

### రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

గోస్పాడు: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని దీబగుంట్ల హైస్కూల్ హెచ్ఎం నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన నంద్యాల టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా.. అండర్ -17 బాలుర విభాగంలో 10 వ తరగతి విద్యార్థులు అబ్దుల్ ఫిరోజ్ గోల్డ్ మెడల్, వేణు సిల్వర్ మెడల్ సాధించారు. అండర్ -15 బాలుర విభాగంలో యల్లా మహీంద్రా గోల్డ్ మెడల్ సాధించారని చెప్పారు. వీరు సెప్టెంబర్ 8-10 వ తేదీ వరకు ఒంగోలు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

# ముమ్మరంగా జీజీఎంపీ పనులు


ముకుందాపురంలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం


రుద్రవరంలో విద్యుత్ స్తంభాలు పాతుతున్న దృశ్యం


శిరివెళ్లలో సిమెంట్ రోడ్డు నిర్మాణం

రుద్రవరం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో జీజీఎంపీ(గడప గడపకు మన ప్రభుత్వం ) పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మండలంలోని పలు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారం కోసం ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు విడుదలయ్యాయి. వాటితో పనులు చేపట్టారు. ఇందులో భాగంగా చిత్రేనిపల్లెలో గ్రామ సెంటర్ నుంచి ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల వరకు రూ.9లక్షలతో సీసీ రోడ్డు వేయించారు. ముకుందాపురంలో రూ.7లక్షలతో ఎస్సీ, ఓసీ కాలనీల్లో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారు. మిగిలిన రూ.4లక్షలను హరినగరం గ్రామానికి కేటాయించారు. ఆ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు గుండా వెంకటనరసింహ్మయ్య, మాధవ,బాలయ్య దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అలాగే మండల కేంద్రమైన రుద్రవరంలో మూడు గ్రామ సచివాలయాలు ఉండగా ప్రభుత్వం నుంచి రూ.60 లక్షలు విడుదలయ్యాయి. వీటి నుంచి విద్యుత్ శాఖకు రూ.8 లక్షలు కేటాయించడంతో ఏఈ రాఘవేంద్రారెడ్డి సోమవారం పలు కాలనీల్లో కొత్త విద్యుత్ స్తంభాలు వేయడం, తీగలు అమర్చి విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

**వేగంగా రోడ్ల నిర్మాణాలు**

శిరివెళ్ల: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వ్యక్తమైన సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తోంది. సచివాలయంలో ఎమ్మెల్యే పర్యటనలో ప్రజలు విన్నవించుకున్న సమస్యలకు నిధులు మంజూరవుతున్నాయి. మండల కేంద్రంలో ఇటీవల 4 గ్రామ సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తయ్యింది. దీంతో ఆయా సచివాలయాల్లో రూ.80 లక్షలతో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎస్సీ కాలనీ, బలిజపేట, మంగళిపేట, కెనరా బ్యాంక్ ప్రాంతాల్లో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇచ్చిన హామీలు సత్వరమే పరిష్కారం కావడం పట్ల ఆయా వార్డుల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**గోవిందపల్లెలో రూ. 40 లక్షలతో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు**

గోవిందపల్లెలోని 2 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. ప్రతి సచివాలయ పరిధిలో రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్లు, విద్యుత్ సదుపాయాల కల్పన, మురుగు కాల్వల నిర్మాణానికి అధికారులు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఆమోదం రాగానే పనులు మొదలు పెడతామని మండల అధికారులు తెలిపారు.

### డ్రంకెన్‌డ్రైవ్‌లో జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): బండిఆత్మకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనం నడిపినందుకు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేశారని పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు.. బండిఆత్మకూరు గ్రామ శివారులో శంకర్ అనే వ్యక్తి మద్యం సేవించి మోటారు సైకిల్ నడుపుతూ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఐదు రోజులు జైలుశిక్ష ఖరారు చేశారు.

### 98 డీఎస్సీ క్వాలిఫైడ్‌లకు ఉద్యోగాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): 98 డీఎస్సీలో మిగిలిపోయిన క్వాలిఫైడ్‌లందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని 98డీఎస్సీ పోస్టుల సాధన పోరాట కమిటీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. స్థానిక నిశాంత్‌భవన్‌లో సోమవారం డీఎస్సీ క్వాలిఫైడ్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్న 6,754 మందిలో 4,072 మందికి మెరిట్ ప్రకారం ఉద్యోగాలు ఇచ్చారన్నారు. రిజర్వేషన్ పాటించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు, దివ్యాంగులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన వారందరికీ ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, మాటను నిలబెట్టుకోవాలని కోరారు. నాయకులు మధుబాబు, జాన్‌బాబు, కృష్ణమూర్తి, వెంగన్న, శిరోమణి, రామాంజనేయులు పాల్గొన్నారు.

## భూ రీ సర్వే ఓ బృహత్తర కార్యక్రమం


మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

చాగలమర్రి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ రక్ష, భూ హక్కు పథకం బృహత్తర కార్యక్రమం అని ఇందుకు రైతులందరూ సహకరించాలని జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్న అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో డి.వనిపెంట గ్రామంలోని చెంచుగూడెం వద్ద రూ.4.80 లక్షలతో వంతెన నిర్మాణం, చాగలమర్రి నుంచి మహాదేవపురం రోడ్డు, బోధనం మెట్ట వద్ద 40 జాతీయ రహదారి నుంచి నేలంపాడు గ్రామం వరకు రోడ్డు, చాగలమర్రిలో రూ.కోటి గడప గడపకు..నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. రాజోలి అనకట్ట నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించిందని, ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.12 లక్షలు మంజూరు చేయటానికి అంగీకరించిందని చెప్పారు. త్వరలోనే పనులను ప్రారంభించనుందన్నారు. మండల నాయకులు బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు వైస్ ఎంపీపీ ముల్లారఫి, ఉప సర్పంచ్ షేక్.మహమ్మద్ సోహెల్, ఎంపిటిసి సభ్యుడు ఫయాజ్, వార్డు సభ్యులు ముల్లా బురాండీన్, డి.మన్సూర్, రాజాఅహ్మద్ ఖాజి యూనుస్, రఫి, ఖాదర్‌బాష, శ్రీనివాసులు గౌడ్ తదితరులున్నారు.

### పశుగణాభివృద్ధికి ప్రాధాన్యత


పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు సింహాచలంను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం పశుగణాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తుందని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు సింహాచలం తెలిపారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన జిల్లా కేంద్రానికి వచ్చారు. స్థానిక సంజీవనగర్ గేట్‌లో ఆధునికీకరించిన చిపోలా మాంసపు మార్ట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్మైల్ ఎంటర్‌ప్రెన్యూర్ ట్రెనింగ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా డీడీలు, ఏడీలతో సహా అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్యాపిలి ఎస్‌టీసీతో పాటు, బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలోని గొర్రెల పెంపకాన్ని పరిశీలించనున్నారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు రమణమూర్తి, సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శిఖర కలశ స్థాపనోత్సవం


ఆలయ గోపురంపై కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని మల్లెవేముల గ్రామ శివాలయంలో జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం శిఖర కలశ స్థాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, నవగ్రహ జపాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను వేదపండితుడు కైప వెంకటనరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో జరిపించారు. అలాగే కలశాలకు జలాభిషేకం చేసి గ్రామంలో ఊరేగించిన అనంతరం ఆలయ గోపురంపై కలశాన్ని వేదమంత్రోచ్చారణ నడుమ ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## నంద్యాల నియోజకవర్గంలో 13,227 ఓట్ల తొలగింపు


మాట్లాడుతున్న అనురాధ

నంద్యాల(అర్బన్): నంద్యాల నియోజకవర్గంలో 13,227 ఓట్లు తొలగించినట్లు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిణి అనురాధ తెలిపారు. 06-01-2022 నుంచి 31-03-2023 వరకు జరిపిన సర్వేలో ఒకే రకమైన ఫొటోలు, మరణాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లడం వంటి వాటిని గుర్తించగా వచ్చిన 13,227 ఓట్లను తొలగించామని చెప్పారు. స్థానిక కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ చంద్రనాయక్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తొలగించిన వాటిని రీ వెరిఫికేషన్ చేయాలంటూ చీఫ్ ఎన్నికల కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డితో కలిసి రీ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించామని వివరించారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆళ్లగడ్డ: సైబర్ మోసాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని రామలక్ష్మీ కొట్టాల కాలనీలో సోమవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 300 ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, ఒక జీపు, ఆటోలను స్టేషన్‌కు తరలించారు. అనంతరం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారమివ్వాలని కోరారు. సీఐలు హనుమంత్‌నాయక్, చంద్రబాబునాయుడు, నారాయణరెడ్డి, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలతో పాటు 200 మంది పోలీసులు పాల్గొన్నారు.

### సీలింగ్ భూములు పేదలకు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలోని సీలింగ్ భూములు అర్హులైన పేదలకు ఇవ్వాలని ఏపీడీఎస్ (ఏపీ దళిత సమాఖ్య) జిల్లా అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ప్రేమ్‌కుమార్ కోరారు. పేదలు సాగు చేసుకుంటున్న ల్యాండ్ సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌డీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నంద్యాల మండలంలోని భీమవరం, పెద్దకొట్టాల, మిటాన్నల, పోలూరు గ్రామాలతో పాటు గడివేముల, గోస్పాడు, కోవెలకుంట్ల, పాణ్యం, బండిఆత్మకూరు మండలాల్లో పేదలు ల్యాండ్ సీలింగ్ భూములను సాగు చేసుకుంటున్నారని చెప్పారు. గుర్రప్ప, జాన్సన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

### అక్రమ కట్టడాలు తొలగించండి

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్, బస్టాండు మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు రహదారులకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలంటూ తహసీల్దార్ రవికుమార్‌కు గ్రామానికి చెందిన ఆలయాల మాజీ ధర్మకర్త ఖాతా దస్తగిరిరెడ్డి వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి హాజరై దస్తగిరిరెడ్డి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆర్అండ్‌బీ అధికారులు అప్పట్లో 7 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయితే కొందరు గ్రామస్తులు రహదారిని ఆక్రమించుకొని బాత్‌రూంలు, మెట్లు ఏర్పాటు చేసుకోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. గతంలో పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు వాటిని తొలగించేందుకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. అలాగే వివిధ గ్రామాల నుంచి పట్టాదారు పాసుపుస్తకంలో తమకున్న భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని రైతులు వినతి పత్రాలు అందజేశారు. నెల రోజుల వ్యవధిలో రైతుల సమస్యలన్నీ పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ట్రాన్స్‌కో ఏఈ గురప్ప, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణారెడ్డి, ఫణీత్కృష్ణ, హౌసింగ్ ఏఈ నరసింహారావు పాల్గొన్నారు.

### దుకాణాల వేలాలు వాయిదా

నంద్యాల(సిటీ): పట్టణంలోని 37 మున్సిపల్ దుకాణాలకు సంబంధించి సోమవారం నిర్వహించిన బహిరంగ వేలాలు వాయిదా వేసినట్లు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన వేలాలకు సరైన పోటీదారులు రానందున వేలాలు వాయిదా వేశామని చెప్పారు.

### జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు జాత సెప్టెంబర్ 1వ తేదీన నంద్యాలకు చేరుకుంటుందని, పార్టీ , ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాతను చేపట్టామన్నారు. బాబాఫక్రుద్దీన్,ప్రసాద్, సోమన్న, శ్రీనివాసులు, నారాయణమ్మ, హబీబ్ బేగ్ షహిన్‌సా, ఖలీల్, మద్దయ్య పాల్గొన్నారు.

### పంట నమోదు తప్పనిసరి

గోస్పాడు: సాగుచేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ పంటలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వప్నిక తెలిపారు. మండలంలోని పసురపాడులో ఈ-క్రాప్ నమోదుపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 15వ తేదీ లోపు పంటల నమోదు పూర్తి చేయించాలని చెప్పారు.

### హోరాహోరీగా క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకుడు రాజు మాట్లాడుతూ ఎస్పీజీ మైదానంలో ఫుట్‌బాల్, వాలీబాల్, హాకీ పోటీలు నిర్వహించారు. అలాగే ఎస్‌డీఆర్ పాఠశాల ఆవరణలో ఫుట్‌బాల్ పోటీలకు పది జట్లు, హాకీ పోటీలకు నాలుగు జట్లు, బాస్కెట్‌బాల్ పోటీలకు ఏడు జట్లు, వాలీబాల్ జట్లకు నాలుగు జట్లు పాల్గొన్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి ఈనెల 29న బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

### భార్యపై దాడి.. కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం గ్రామానికి చెందిన రామాంజనేయులు తన భార్య ప్రభావతమ్మను నిత్యం మద్యం సేవించి వచ్చి మానసికంగా శారీరకంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం కూడా తాగివచ్చి భార్యతో గొడవపడి ఆమె తలపై కర్రతో కొట్టాడు. దీంతో గాయాలపాలైంది. బాధితురాలి ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

### పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పదోన్నతుల్లో ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన ఎస్సీ,ఎస్టీ, ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. లక్ష్మణ్‌నాయక్, దేవేంద్రుడు, రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

### చెరువుల్లో పెద్ద సైజు చేపపిల్లలను వదలాలి

నంద్యాల(అర్బన్): చెరువుల్లో ఆరోగ్యవంతమైన పెద్ద సైజు చేపపిల్లలను వదిలితే సొసైటీ సభ్యులకు ఆదాయం వస్తుందని మత్స్యశాఖ ఏడీ సంధ్యారాణి తెలిపారు. నంద్యాల మండలం కానాల గ్రామ నాగమ్మ చెరువు చేపల సొసైటీ సంఘ సభ్యులకు చేపల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్స్య అభివృద్ధి అధికారి పామన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంఘ సభ్యులు డిపార్టుమెంట్ స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## చెప్పినవి.. చెప్పనివి చేసిన జగనన్న


వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన వాటితో పాటు చెప్పనివి కూడా చేసి ప్రజల మద్దతు వంద శాతం పొందిన ఏకైన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణ శివారులోని పడకండ్లలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? పింఛన్ ఇంటిదగ్గరకే వచ్చి ఇస్తున్నారా? పాలన ఎలా ఉంది, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా, సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. పలువురు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు అమలు చేశామని, నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి, మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఏఈ సురేంద్ర, నాయకులు సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, చిన్నరామిరెడ్డి, చిన్నవెంకటసుబ్బయ్య, గోపాల్, రాజ ఉన్నారు.

## పిల్లలను బడిలో చేర్పించాలి


వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): 5- 18 ఏళ్లలోపు బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో జీఆర్ సర్వేలో భాగంగాలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. సమావేశంలో డీఈఓ, ఎంఈఓ, ఎంపీడీఓ, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డ్రాప్ ఔట్ పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే.. ఇంత వరకు అడ్మిషన్ కాని వారిని కూడా గుర్తించి చేర్పించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత ఎంపీడీఓ, విద్యాశాఖ, గ్రామీణ వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందన్నారు. డీఈఓ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఎంఈఓ బ్రహ్మంనాయక్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

## పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జిల్లాలో విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మృతి చెందిన 11 మంది పోలీస్ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మృతిచెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు విడో ఫండ్, కార్పస్ ఫండ్, ఫగ్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్ లాంటివి లబ్ధిచేకూరేలా చూస్తామన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు రావాల్సిన అన్ని రకాల ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు ఉన్నారు.

**ట్రాఫిక్ బారికేడ్స్ అందజేత**

నంద్యాల పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం నాగార్జున సిమెంట్ యాజమాన్యం 65 బారికేడ్లను అందించిందని ఎస్పీ కే.రఘువీర్ రెడ్డి సోమవారం తెలిపారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తామని చెప్పారు.

## దోమల నివారణకు చర్యలు


జగజ్జనని గుడి వద్ద గంబూసియా చేపలను వదులుతున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలో దోమలు వృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని నీటి కుంటల్లో జిల్లా మలేరియా అధికారి వీ. కామేశ్వరరావుతో కలిసి గంబూసియా చేపలను వదిలారు. కమిషనర్ మాట్లాడుతూ నీటి కుంటల్లో గంబుసియా చేపలను వదలడం ద్వారా అవి దోమలు లార్వాలను అంతం చేస్తాయని చెప్పారు. అలాగే మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నామన్నారు. కాల్వల్లో స్ప్రేయింగ్, వార్డుల్లో ఫాగింగ్, డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహిస్తున్నామని వివరించారు. డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మలేరియా అధికారి(ఏఎంఓ) వరప్రసాద్‌రెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన నంద్యాల విద్యార్థి


పతకాలు సాధించిన విద్యార్థి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని లీడర్స్ మోడల్ పాఠశాల విద్యార్థి మధుతేజ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకంతో పాటు వెండి పతకాలు సాధించాడని కరస్పాండెంట్ రవిరాకేష్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్‌లో జాతీయ స్థాయిలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ సబ్ జూనియర్స్ 75 కేజీల విభాగంలో మధుతేజ బంగారు పతకం సాధించగా బెంచ్ ప్రెస్ పోటీల్లో వెండి పతకం సాధించి మొదటి స్థానంలో నిలిచాడని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లయ్య ఉన్నారు.

### వ్యాసరచన పోటీలు

ఆళ్లగడ్డ: తెలుగు భాషా వారోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఫర్హత్‌నసీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు గొప్పతనం గురించి వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు.